



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

మంగళవారం 15 అక్టోబర్ 2024 9 పేజీలు


### రాజన్న ఆలయానికి

## బంగారు తాపడం, వెండి పల్లకి

- యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి చర్యలు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- రాజన్న ఆలయ అభివృద్ధి పై సీఎం ప్రత్యేక దృష్టి..
- భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తాం..
- స్వామి వారిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్న మంత్రి




**సూర్య, వేములవాడ**

యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం (మిగతా 2లో)



### ఘనంగా సద్దుల

## బతుకమ్మ వేడుకలు

**సూర్య, రుద్రంగి**

- సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలు
- ఆకట్టుకున్న డోలు వాయిద్యాలు, బతుకమ్మ దాండియాలు
- వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, 2లో








### వారి ప్రతిభకు

## తల వంచిన కొలువులు

- ఆ గ్రామ యువత అన్నిటా ఆదర్శం
- కన్నోళ్ల కలలు పండిస్తున్న వైనం



**సూర్య, గంభీరావుపేట**

వారందరివి మధ్యతరగతి కుటుంబాలే తల్లి,దండ్రుల కష్టాన్ని కళ్ళారా చూసి కసితో చదివారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. మారు మూల గ్రామం నర్మాల నుంచి ఇటీవల సర్కార్ కొలువులు సాధించి యువకుల గురించి సూర్య అందిస్తున్న ప్రత్యేక కథనం 8లో

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవి

## బాధ్యతలు స్వీకరించిన సత్తు మల్లేశం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లేశం సోమవారం జిల్లా కేంద్రంలోని గ్రంధాలయంలోని తన ఛాంబర్‌లో వేద పండితులు ఆశీర్వాదం ఇవ్వగా పదవి బాధ్యతలు స్వీకరించినారు. అనంతరం పలువురు కాంగ్రెస్ శ్రేణులు సన్మానించి అభినం దించడం జరిగింది. ఈ సందర్భంగా సత్తు మల్లేశం మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి, శాసనసభ్యులు (మిగతా 2లో)

### మున్సిపల్ కమిషనర్‌కు ఎస్సీ, ఎస్టీ

## అట్రాసిటీ కమిషన్ నోటీసులు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. మాజీ మున్సిపల్ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ అలియాస్ మార్షల్ గత సెప్టెంబర్ 5న తన భార్య మెండి శ్రీలత ప్రాతినిథ్యం వహిస్తున్న 44వ డివిజన్లో పెద్ద డ్రెయినేజీ కూలిపోయి నప్పటికీ పనులు చేపట్టకపో వడం,తీగలగుట్టపల్లిలో అక్రమ కట్టడం కూల్చివేతపై (మిగతా 2లో)

## డిప్యూటీ రెంజ్ అధికారి సస్పెండ్

**సూర్య జగిత్యాల**



జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రెంజ్ అధికారి అరుణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ సాయిరాంను అటవీశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 11న జగిత్యాల అటవీశాఖ కార్యాలయ అవరణలో అధికారులు, సిబ్బంది దావత్ ఏర్పాటు చేసుకుని మద్యం సేవించారు. ఈ దృశ్యాలు మీడియాలో ప్రసారం కావటంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. తీవ్రంగా పరిగణించిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఇద్దరిపై (మిగతా 2లో)

# రాజన్న ఆలయానికి బంగారు తాపడం, వెండి పల్లకి

*(మొదటి పేజీ తరువాయి)*

చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలో పర్యటించిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , ఎస్పీ అఖిల్ మహజన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. వేములవాడ రాజన్న ఆలయం అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఆలయంలోకి స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వాదం మధ్యలో మంత్రి స్వామివారి దర్శనం చేసుకుని కోడె మొక్కులు చెల్లించారు. రాజన్న



దేవాలయం సన్నిధిలో మనవడి పుట్టి వెంట్రుకల కార్యక్రమాన్ని మంత్రి కుటుంబ సభ్యుల తో పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాజన్న దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే రాజన్న దేవాలయ అభివృద్ధి పై సీఎం స్థాయిలో అత్యున్నత సమావేశం జరుగుతుందని, శాస్త్రాల ప్రకారం ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని రకాల వసతులను కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకున్నామని, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని అన్నారు. యాదాద్రి తరహాలో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, యాదాద్రి ఆలయానికి 63 కేజీల బంగారంతో తాపడం ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం ఉత్తర్వులు



జారీ చేసిందని అన్నారు. వేములవాడ దేవాలయం వద్ద 65 కేజీల బంగారం 5000 కిలోల వెండి అందుబాటులో ఉందని వీటిని వినియోగించుకొని వేములవాడ ఆలయానికి సైతం బంగారు తాపడం, వెండితో పల్లకీలు, ఉత్సవ విగ్రహాలు రూపొందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అనంతరం మంత్రి బద్దీ పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆలయ ఈ.ఓ. వినోద్ రెడ్డి,, ఆర్.డి. ఓ. రాజేశ్వర్, వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగిమహేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కుటుంబ సభ్యులు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములను సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీలు తీయించి గదిలో ఉన్న ఈవీఎం వీవీ ప్యాట్లను పరిశీలించారు. అనంతరం సీలు వేయించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఎప్పటి కప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో ట్రైనీ ఐఏఎస్ అజయ్ కుమార్, ఆర్డీఓ మహేశ్వర్, రాజకీయ పార్టీల నాయకులు మడుపు మోహన్ చారి (కాంగ్రెస్), సత్తినేని శ్రీనివాస్ (బీఆర్ఎస్), నాంపల్లి శ్రీనివాస్ (బీజేపీ), వాసుదేవరెడ్డి సీపీఐ(ఎం), కళ్యాణపు ఆగయ్య (టీడీపీ), సిరిసిల్ల అంజయ్య (బీఎస్పీ) పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**సూర్య రుద్రంగి**

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నంగా మహిళలు కొలిచే గునుగు, తంగేడి పూల పండగ సద్దుల బతుకమ్మ వేడుకలను సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో కన్నుల పండుగ జరుపుకున్నారు. దసరా పండుగ అనంతరం సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుంది. మహిళలు తంగేడు, గునుగు, పట్ల కుచ్చులు, బంతి పూలతో పాటు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలు పేర్చి మధ్యలో గౌరమ్మను ఉంచి బతుకమ్మలను తీసుకొని గ్రామ ప్రధాన కూడలిలో ఉంచి మహిళలు కోలాటాలు ఆడి పాడారు. గ్రామంలోని బతుకమ్మలను మహిళలు ఇందిరా చౌక్ వద్ద పెద్ద ఎత్తున బతుకమ్మ ఉంచి ఆట పాటలతో సందడి చేయగా డోలు వాయిద్యాలు, డాండియా ఆటపాటలతో సందడి నెలకొంది. మహిళల ఆటపాటలు చూపరులను ఆకట్టుకుంది. అనంతరం మహిళలు బతుకమ్మలతో సామూహికంగా తరలివెళ్లి గ్రామ శివారులోని బతుకమ్మ కుంటలో వెళ్లిరా గౌరమ్మ పోయిరావమ్మా అంటూ పాడుతూ నిమజ్జనం చేశారు. అనంతరం తమతో తెచ్చుకున్న సత్తి పిండిని మహిళలు ఒకరికొకరు ఆయనంగా పంచుకొని సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సొంత గ్రామం రుద్రంగిలో సద్దుల బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస మాట్లాడుతూ తెలంగాణ జీవన ప్రమాణాలకు ప్రతిరూపమైన బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం తెలంగాణ సాంప్రదాయంగా వస్తుంది. మహిళలు పూలనే దేవునిగా కొలిచే ఈ పండుగకు తెలంగాణలో ఎంతో విశిష్టత కలిగి ఉందన్నారు. చిన్న పెద్ద, కులమత భేదాలు తేడా లేకుండా అందమైన బతుకమ్మలతో ఆటపాటల మధ్య ఈ వేడుకలను నిర్వహించుకోవడం చాలా గొప్ప విశేషం అన్నారు. ఈ పూల పండగను స్వగ్రామంలో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మహిళా తల్లులకు, సోదరిమణులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి రాందాస్ గ్రామంలో ని ప్రధాన కూడలితో పాటు బతుకమ్మ కుంట వద్ద రంగు రంగుల విద్యుత్ దీపాలతో భారీ ఏర్పాట్లు చేయించారు. బతుకమ్మ సంబరాలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సతీమణి మాజీ జెడ్పిటిసి ఆది వనజ పాల్గొని బతుకమ్మలను ఎత్తుకొని వేడుకల్లో మహిళలతో ఆడి పాడి మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో మహిళలు కొలిచే అతి పవిత్రమైన పండగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ వేడుకలను రుద్రంగిలో ఇంత ఘనంగా నిర్వహించడం పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం తెలంగాణ సాంస్కృతిక అర్థం పడుతు ందన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వర్ణ రాణి, మాజీ జెడ్పిటిసి గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత - మనోహర్, నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగ నర్సయ్య, సామ మోహన్ రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, సూర యాద య్య, కొమిరె శంకర్, గంధం మనోజ్, పోగుల మహేష్, ధర్నా మల్లేశం, గంగం మహేష్, మంచె రాజేశం, పూదరి మహిపాల్, మహిపాల్ రెడ్డి, ఆకుల గగన్, చెలుకల శ్రీకాంత్, ఎర్రం అరవింద్, ఉప్పులూరి గణేష్, సనుగుల గంగా ధర్, కేసిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి ఆనం దం, తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. బతు కమ్మ వేడుకల సందర్భంగా ఇలాంటి పవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవి

# బాధ్యతలు స్వీకరించిన సత్తు మల్లేశం

*(మొదటి పేజీ తరువాయి)*

డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి, మేడిపల్లి సత్యంకి, విజయ రమణారావుకి, పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్ హాజరై అభినందించి, శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. సిరాజ్ హుస్సేన్, వంగల విద్యాసాగర్, గంగుల దిలీప్ కుమార్, సిరిపురం లావణ్య నాగప్రసాద్, కామ్రెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి, మాదాసు శ్రీనివాస్, రోళ్ళ సతీష్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మంద మహేష్, ముద్దసాని రంగన్న, పెద్ది గారి తిరుపతి, బుర్ర హరీష్ గౌడ్, రూపు రెడ్డి శ్రీనివాసరెడ్డి, మారుతీ రావు పాల్గొన్నారు.

# డిప్యూటీ రేంజ్ అధికారి సస్పెండ్

*(మొదటి పేజీ తరువాయి)*

వేటు వేయగా మరికొంత మందిపైన కూడా వేటుపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్ ను మీడియా ప్రతినిధులు వివరణ కోరగా విచారణ జరుగుతుందని, విచారణ అనంతరం ఈ సంఘటనతో బాధ్యులైన వారందరిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు

# గొడవ చేసిన విద్యార్థులకు కౌన్సిలింగ్

## -మళ్లీ గొడవలకు దిగితే చట్ట పరిధిలో చర్యలు తప్పవు -'ఖని' ఏసిపి మడత రమేష్

**సూర్య-గోదావరిఖని:**

ఇక్కడి సింగరేణి జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో రావణ దహన కార్యక్రమంలో జరిగిన గొడవకు బాధ్యులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సోమవారం గోదావరిఖని ఏసిపి మడత రమేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో సుమారు 35 వేల మందికి పైగా ప్రజలు పాల్గొనడం జరిగిందని, కేవలం ఇద్దరు ముగ్గురు యువకులు వారి ఒకరి చెయ్యి ఒకరికి తగలడంతో గొడవ జరిగిందని తెలిపారు. ఇట్టి గొడవతో అక్కడున్న సామాన్య ప్రజలు



భయభ్రాంతులకు గురయ్యారని, వెంటనే తమ పోలీసులు రంగంలోకి గొడవ చేసిన ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గొడవకు పాల్పడిన వారు ఉద్దేశపూర్వకంగా గాని, ఏటువంటి చెడు ప్రవర్తన కలిగి ఉండకపోవడంతో వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి పంపించడం జరిగిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ఏసిపి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని, వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు అనే విషయాలపై ఖచ్చితంగా దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు మాట వినని పక్షంలో పోలీసులకు సమాచారం అందించాలని, తాము సామరస్యంగా విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి, వారిని సన్మార్గంలో పయనించేలా చూస్తామని చెప్పారు. భవిష్యత్తులో మళ్లీ గొడవలకు దిగితే చట్ట పరిధిలో చర్యలు తప్పవని ఏసిపి రమేష్ హెచ్చరించారు.

# మున్సిపల్ కమిషనర్‌కు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిషన్ నోటీసులు

*(మొదటి పేజీ తరువాయి)*

స్పందించకపోవడం వంటి విషయాలపై మార్షల్ అడిగేందుకు వెళ్లగా కమిషనర్ అసభ్యపదజాలంతో గెట్ ఔట్ అంటూ మాట్లాడిన విషయంపై మొదట కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో,ఆ తర్వాత కరీంనగర్ పోలీస్ కమిషనరుకు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు మార్షల్ ఫిర్యాదు చేసినారు. మార్షల్ ఫిర్యాదుతో పాటు వీడియో రికార్డును కూడా సమర్పించగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆ వీడియోను, ఆడియోను నిశితంగా పరిశీలించిన పిదప కార్పొరేషన్ కమిషనర్ కు నోటీసులు జారీ చేసింది.అదే విధంగా కమిషనర్ పై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి 30 రోజుల లోపు నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ కు, కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసిందని మెండి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# వయోధికులకు చట్టం ఆసరా

**సూర్య జగిత్యాల అర్బన్**



సీనియర్ సిటీజన్స్ కోసం చట్టం ఆసరాగా ఉందని,వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా కౌన్సెలింగ్ కేంద్రంలో వయోధికుల రక్షణ, పోషణ సంక్షేమ చట్టంపై హరి ఆశోక్ కుమార్ వయోధికులకు అవగాహన కల్పించారు. వయో వృద్ధులు తమను నిరాదరిస్తున్న కొడుకులపై పెట్టిన కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా హరి ఆశోక్ కుమార్ ముఖ్య అతిథిగా, ప్రధానవక్తగా హాజరయ్యారు. నిరాదరణకు గురైన వయోధికులైన తల్లిదండ్రులు సంబంధించిన రెవెన్యూ డివిజన్ అధికారికి ఫిర్యాదు చేస్తే వారి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఆర్డీవో తీర్పును పాటించకపోతే 3 నుంచి 6 నెలల జైలు శిక్ష విధించే వీలుందన్నారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలో ఆర్డీవోలు జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్‌లు వృద్ధుల కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలిచారని పేర్కొన్నారు. తమ తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అస్సోసియేషన్ రాష్ట్రంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన అసోసియేషన్ అంటూ వయో వృద్ధులైన తల్లిదండ్రులకు అండగా ఉంటుందన్నారు. చట్టంలో 2019లో చేసిన సవరణలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించాలని, అందుకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. ఈ అవగాహన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు,కౌన్సెలింగ్ అధికారి పి.సి.హన్మంత్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్ముల ప్రకాశ్ రావు,కోరుట్ల డివిజన్ కౌన్సెలింగ్ అధికారులు పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, ఎన్.లక్ష్మి నారాయణలు, ఎం.డి.సైఫోద్దిన్, మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి,కార్యదర్శి సౌడాల కమలాకర్, కతలాపూర్ అధ్యక్షుడు అల్లూరి బాపురెడ్డి,మేడిపల్లి అధ్యక్షుడు ఒద్దినేని గోవర్ధన్ రావు,కార్యదర్శి ఎండి.బురానోద్దీన్,ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు కండ్లే గంగాధర్,సారంగపూర్ అధ్యక్షుడు కాలగిరి గంగ రెడ్డి, మహిళా కౌన్సెలింగ్ అసిస్టెంట్ శ్రావణి ,వివిధ మండలాల, గ్రామాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీ యూ ఫోరం పార్లమెంటు కన్వీనర్‌గా నక్క గంగాధర్

**సూర్య జగిత్యాల టౌన్**

జగిత్యాల పట్టణానికి చెందిన నక్క గంగాధర్ (కేసీఆర్)ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిజామాబాద్ పార్లమెంటు కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ రావు ఉత్తర్వులు జారీచేశారు. గంగాధర్ తెరాస ఉద్యమ పార్టీగా అవతరించిన నాటి నుండి నేటి వరకు తెరాసలో కొనసాగుతూ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. 2004లో గాంధీ నగర్ వార్డు నంబర్ 30లో తెరాస నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. తెరాస పార్టీ పట్టణ దళిత విభాగం పట్టణ అధ్యక్షులుగా, తెరాస జిల్లా పార్టీ కార్యదర్శిగా, దళిత విభాగం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేసారు. ఇప్పుడు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ గంగాధర్‌ను ఉద్యమకారుల ఫోరం నిజామాబాద్ పార్లమెంటు కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల న్యాయ బద్ధమైన హక్కుల సాధనకు తనవంతుగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకంతో నన్ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పార్లమెంటు కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్‌కు, నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగెల రవింధర్ రెడ్డికి, ఉద్యమ నాయకులు చింతల గంగాధర్, పడాల శ్రీనివాస్, నాచు పెల్లి రెడ్డి, తన్నీరు సత్యం రావు తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉరి వేసుకొని యువకుని మృతి

**సూర్య-కోరుట్ల**



కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డులో గల రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల్ నీల గ్రామానికి చెందిన అహ్మద్ అఫ్సర్ షేక్ అనే 23 సంవత్సరాల యువకుడు కోరుట్లలో నివాసం ఉంటున్న తన నానమ్మ ఇంటికి వచ్చాడు. ఆయన గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తను ఎన్నటికీ బాగుపడలేనని మనోవేదనతో జీవితంపై విరక్తి చెంది సోమవారం కల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి సమీపంలో గల చెట్టుకు ఉరివేసుకొని మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఆయన తండ్రి షేక్ ముక్తార్ షేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వైద్యులను పరామర్శించిన జువ్వాడి

**సూర్య-కోరుట్ల**



కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రవికిరణ్‌ల తండ్రి ఇటీవల మరణించగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కోరుట్ల పట్టణంలో సోమవారంమృతుడి గృహానికి వెళ్లి వైద్యులను పరామర్శించారు. కృష్ణారావు వెంట కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

**- తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చిన మహిళలు**
**- ఆకట్టుకున్న యువతుల కోలాటాలు**

**సూర్య-కోరుట్ల**



తెలంగాణ ఆడపిల్లల ఆత్మగౌరవానికి ప్రతికగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. కోరుట్ల పట్టణంలోని విలీన గ్రామమైన ఎకిన్‌పూర్ గ్రామంతో పాటు కోరుట్ల పట్టణపరిసర గ్రామాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు మహిళలు యువతులు పూజలు నిర్వహించారు.బతుకమ్మ ఆటపాటలతో ఆడి పాడారు. గ్రామాలలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ సమీపంలోని వాగులో బతుకమ్మలను నిమర్జనం చేశారు. అనంతరం మహిళలు ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**సూర్య, మల్యాల**



తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకైన సద్దుల బతుకమ్మ వేడుకలు సందర్భంగా మల్యాల మండలంలోని పోతారం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు ఉదయం నుంచే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేరించి ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం వేళ బతుకమ్మను ఒకచోట పెట్టి బతుకమ్మ ఆటపాటలు ఆడారు అనంతరం బతుకమ్మను ఊరేగింపుగా వెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామ్మోహన్ రావు, సింగల్ విండో చైర్మన్ సాగర్ రావు, బిఆర్ఎస్ నాయకులు కోటేశ్వరరావు, జున్ను, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల మధ్యలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ తరలించాలని ప్రజావాణి లో వినతి

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని అంగడి బజార్ లో గల బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్ ను అక్కడి నుండి తరలించాలని ఆ కాలనీ వాసులు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐ డి వో సి లో నిర్వహించిన ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. ఈ బార్ అండ్ రెస్టారెంట్ లో మద్యం సేవించి నా నా హంగామా సృష్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నివాసాల మధ్యలో ఉన్న ఈ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఇక్కడి నుండి తొలగించాలని వారు కోరారు.

## ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్ర గాయాలు

**సూర్య పెగడపల్లి**

అతివేగంతో అజాగ్రత్తగా వాహనం నడిపి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొనడంతో భార్యాభర్తలిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని పెగడపల్లి ఎస్సై సిహెచ్ రవికిరణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామడుగు మండలం గోపాలరావుపేటకి చెందిన అలువాల విష్ణు రమ్య ఇద్దరు కలిసి తమ ద్విచక్ర వాహనంపై ఆదివారం రాత్రి 9:30 సమయంలో గోపాల్ రావు పేట నుండి పెగడపల్లి వైపు వస్తుండగా మేకవెంకయ్య పల్లి గ్రామం దగ్గర్లోని బ్రిడ్జి వద్ద కి చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి తన మోటార్ సైకిల్ నెంబర్ Ap 25Q 8256 అతివేగం నడుపుతూ డీ కొట్టాడు. భార్యాభర్తలు కింద పడగా వారికి తీవ్ర గాయాలు అవ్వగా, వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం రమ్య పరిస్థితి విషమంగా ఉందని, అలవాల అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**సూర్య పెగడపల్లి**



అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సిహెచ్ రవి కిరణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన బండి తిరుపతి గౌడ్ 43 సంవత్సరాల వ్యక్తిగత 3 సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యలు యూరిక్ యాసిడ్, మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్న నయంకాకపోవడంతో సోమవారం ఉదయం 5 గంటలకు తన ఇంటి నుండి వెళ్లి తన గ్రామ శివారులో మామిడి చెట్టుకు నైలాన్ తోడు వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య బండి పుష్ప, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఒక్కేసి..పువ్వేసి..చందమామ

**- ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**
**- పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్**

**సూర్య మెట్‌పల్లి**



డివిజన్ కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు, అనే తేడా లేకుండా అందరూ బతుకమ్మలను పేరించి వాడవాడలా బతుకమ్మ పాటలు పడుతుండడంతో వీధులన్నీ పూల జాతరను తలపించాయి. ఉదయం నుంచి మహిళలు బతుకమ్మలను పేరుస్తూ కనిపించగా సాయంత్రం లోగిళ్ళన్ని పూల వనాలతో నిండిపోయాయి. సాయంత్రం 5 గంటల నుండి వీధులలో బతుకమ్మలను పెట్టి బతుకమ్మ పాటలు, పడుతూ డీజే పాటలకు యువతులు మహిళలు దాండియా నృత్యాలు చేస్తూ బతుకమ్మలను వీధుల్లో ఊరేగించారు. వట్టివాగు, పెద్ద చెరువు, వెల్లుల్లా రోడ్డులోని ఒర్రె ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.డివిస్పీ ఉమామహేశ్వరరావు, సీ ఐ నిరంజన్ రెడ్డి, ఎస్ ఐ చిరంజీవి ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక..**

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ వేడుకలు నిలుస్తాయని మున్సిపల్ చైర్పర్సన్ రణవేణి సుజాత సత్యనారాయణ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సతీమణి సరోజమ్మతో కలిసి పేరించిన బతుకమ్మ ను స్వయానా మోస్తూ ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేసారు.పలు ప్రాంతాల్లో మహిళలతో కలసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు బోర్డులపై ఉర్దూలో పేర్లు ఏర్పాటు చేయాలి

**సూర్య మెట్‌పల్లి**



ఆర్టీసీ బస్సు, బస్టాండ్‌లోని బోర్డులపై ఉర్దూలో పేర్లు ఏర్పాటు చేయాలని అంజుమాన్ ఇషాత్ ఏ ఉర్దూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ దేవరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఉర్దూ భాషలో బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ముస్లిం ప్రయాణికులతో పాటు ఉర్దూ భాషలో ప్రావీణ్యం ఉన్నవారికి అనుకూలంగా ఉంటుందని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అంజుమాన్ ఇషాత్ ఏ ఉర్దూ అధ్యక్షుడు ఎంఏ అజీజ్, ప్రధాన కార్యదర్శి ఖారి మహమూదల్ హసన్ ఖాస్మి, కోశాధికారి ఎండి ఇబ్రహీం, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎంఏ మోకిత్, ఎండీ సహీద్, అహ్మద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

## యువత వృత్తి నైపుణ్య, ఉపాధి శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**- త్వరలో రామగుండంలో ఐటి, ఏఐ స్కిల్ సెంటర్‌ల ఏర్పాటు కు ప్రణాళికలు**

**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సూర్య-గోదావరిఖని**



ప్రస్తుత పోటీ ప్రపంచంలో వృత్తి నైపుణ్యత ఉన్నవారు మాత్రమే ఆయా రంగాలలో రాణించడం జరుగుతుందని, అంతేకాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా వారికి లభిస్తాయని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఈ మేరకు సోమవారం సింగరేణి కాలరీస్ ఆర్జీ-1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు నైపుణ్య శిక్షణ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని గోదావరి ఖని పట్టణంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇక్కడ ఏర్పాటుచేసిన నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా యువతకు ఉపాధి లభించేలా అవసరమైన నైపుణ్యాలు అందించడం జరుగుతుందని, ఎల్అండ్ టీ, ఐసిఐసిఐ వంటి ప్రముఖ సంస్థల సహకారంతో యువతకు మార్కెట్ లో డిమాండ్ ఉన్న వాటిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలోని నైపుణ్యానికి పదును పెట్టడం జరుగుతుందని వివరించారు. యువత నైపుణ్యాలు నేర్చుకునేందుకు ముందుకు రావాలని, వచ్చే రెండు నెలల్లో అగ్ని వీర్ నోటిఫికేషన్లు కూడా వస్తాయని, ఇందులో పాల్గొనాలనుకునే వారికి అవసరమైన శిక్షణ అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. యువత దగ్గర మంచి నైపుణ్యాలు ఉంటే ఉపాధి లభిస్తుందని, మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంటుందని, నైపుణ్యాలను మనం ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. త్వరలో రామగుండంలో ఐటి, ఏఐ స్కిల్ సెంటర్ ల ఏర్పాటు కు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ జీఎంఆర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో 150 మంది యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభు త్వం ఏర్పడిన తర్వాత యువతకు ఉపాధి కల్పన పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని వివరించారు. 60 వేల మంది పైగా యువతకు ప్రభుత్వం ఉద్యోగాల నియామక పత్రాలు అందించిందని, లక్షల మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించామని అన్నారు. గతంలోని పేపర్ లీకేజీ సమస్యలను పరిష్కరించి పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఎన్టీపిసి, సింగరేణి, మెడికల్ కళాశాల, ఆర్.ఎఫ్.సి.ఎల్ లో స్థానికులకు ఉపాధి కల్పించేలా చూడాలని కలెక్టర్ ను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, గోదావరిఖని ఏసిపి మడత రమేష్, సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షులు బి.మల్లేశం, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్ తదితరులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు

**- ఓసీపీ-3 ప్రాజెక్ట్‌లో ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర పై సమీక్ష**

**- రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఆర్జీ-2 డివిజన్ ఆధ్వర్యంలో ఓసీపీ-3 ప్రాజెక్ట్ లో, సిహెచ్ పి, సెక్యూరిటీ విభాగం, మెడికల్ విభాగం, రెస్క్యూ విభాగం, జీఎం కార్యాలయం ఉద్యోగులకు కృషి భవన్, సిహెచ్ పి లలో (రెండు ఏరియాలలో) ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర అనే అంశంపై ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉండాలని సింగరేణి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ప్రాజెక్టు అధికారి ఎస్.మధుసూదన్ కంపెనీ యొక్క స్థితిగతులను ఎల్ఈడి స్క్రీన్ పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సింగరేణి ఉద్యోగులు పని సంస్కృతి లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి ఉద్యోగులు సహకరించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎల్.వి. సూర్యనారాయణ కోరారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలను పూర్తి పని గంటలు వినియోగిస్తూ ఉత్పత్తులు, ఉత్పాదకత పెంచాలని కోరారు. బొగ్గు పరిశ్రమలో కోల్ ఇండియా కంటే ముందుగా సింగరేణి సంస్థ ఏర్పడి ఈ ప్రాంత ప్రజలకు జీవనాధారమైందని, ఈ సంస్థ ద్వారా ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి దొరికే విధంగా సింగరేణిని ఇతర రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ఈ ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో రామగుండం కు పూర్వ వైభవం తీసుకురావడం కోసం పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, వచ్చిన లాభాలలో ఉద్యోగులకే కాకుండా ఒప్పంద ఉద్యోగులకు 5 వేల రూపాయలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని, అలాగే సింగరేణి ఉద్యోగులకు సొంత ఇంటి కలను నిజం చేయడం జరుగుతుందని వారు అన్నారు. అనంతరం వారు ఉద్యోగులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమాలలో గోదావరి ఖని ఏసిపి ఏం.రమేష్, ప్రాజెక్ట్ అధికారి ఎస్.మధుసూదన్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారుల సంఘం ప్రతినిధి జనార్దన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, అఫిషియేటింగ్ ఎస్ఓటు జిఎం ఎస్.సంతోష్ కుమార్, డిజిఎం (పర్సనల్&అధికార ప్రతినిధి) ఎస్.అనిల్ కుమార్, వర్క్ షాప్ డిజిఎం ఎర్రన్న, డిజిఎం ఐఇ మురళీకృష్ణ, డిజిఎం ధనుంజయ, డిజిఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, ఎస్ఇ సిహెచ్ పి సదానందం, ఏరియా సర్వే అధికారి బుక్య దేశాయి, ఓసీపీ-3 మేనేజర్ భరత్ కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా.మహిపాల్, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, గోదావరిఖని టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, డివైపిఎంలు వేణుగోపాల్, వంశీధర్, సంక్షేమాధికారి రాజు ఇతర ప్రజాప్రతినిధులు, ఓసీపీ-3, సిహెచ్‌పి, సెక్యూరిటీ విభాగం, మెడికల్ విభాగం, రెస్క్యూ విభాగం, ఒప్పంద ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యాన్ని నెమరేసుకున్న పూర్వ విద్యార్థులు

**సూర్య, సెంటినరీ కాలనీ**

రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని వందన ఉన్నత పాఠశాలలోని 2007-08 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సెంటెనరీ కాలనీ లోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల్య



స్మృతులను నెమరు వేసుకున్నారు. వారికి పాఠాలు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తూ వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా ఆనందంగా గడిపారు.

## మహిళలకు మిషన్ శక్తి పై అవగాహణ

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలంలోని రాఘవాపూర్ ఉషోదయ గ్రామైక్య సంఘం వివో సమావేశంలో పెద్దపల్లి జిల్లా మహిళా సాదికరిత కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు మిషన్ శక్తి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాదికరిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్, చెంద్రు స్వప్న, ఫైనాన్స్ లిట్రసి సేరు సంధ్యారాణి మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుందని, ఆడపిల్లల రేటును పెంచడం, మరియు శిశు మరణాల రేటును తగ్గించడమే బేటీ బచావో బేటీ పడవో ముఖ్య ఉద్దేశమని, ఆడపిల్లలు అన్ని రంగాలలో ముందు ఉండాలని అన్నారు. మహిళలకు, ఆడపిల్లల రక్షణ కొరకై, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సఖి కేంద్రం,చైల్డ్ హెల్ప్ లైన్, భరోసా, షీ టీం వంటి ఎన్నో భద్రత కేంద్రాలు, చట్టాలు, మరియు హెల్ప్ లైన్ నంబర్లు ఉన్నాయని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళా సాధికారత సాధ్యమని తెలిపారు. మహిళలు సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలని, ఫోన్లలో వచ్చే అనవసర మెసేజెస్ మరియు లింకులకు యాప్ లకు ప్రలోభం కావద్దని తెలిపారు. ఈకార్య క్రమంలో వి.వో.ఏ తిరుమల కార్యదర్శి గౌతమి కోశాధికారి గంఘ, మహిళలు పాల్గొన్నారు.

## కవి నూనె రాజేశంకు సన్మానం

**సూర్య, సెంటినరీ కాలనీ**



కరీంనగర్ వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన కవి సమ్మేళనంలో డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ (కవి,రచయిత) అధ్యక్షతన మహాకవి దాశరథి స్మృతులను కొనియాడుతూ 84 మంది కవులు రచించిన పాటల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా జూకంటి జగన్నాథం, జెల్లి విద్యాధర్, డాక్టర్ రాదా కుసుమా, గద్దూరి వెంకట దాసు, తదితర కవులు పాల్గొని దాశరధిని కొనియాడారు. కవి నూనె రాజేశంను శాలువాతో సత్కరించి పుస్తకంను బహుకరించారు.

## అవెన్యూ ప్లాంటేషన్ పనులు పరిశీలన

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలంలోని పెద్దబొంకూర్ గ్రామంలో ఏపీవో రమేష్ బాబు సోమవారం అవెన్యూ ప్లాంటేషన్ పనులు, నర్సరీలో మొక్కలను పరిశీలించారు.

## క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

**- సీఎం కప్ టార్చ్ క్రీడా ర్యాలీకి ఘన స్వాగతం**

**- ఎమ్మెల్యే విజయ రమణారావు**

**సూర్య - సుల్తానాబాద్**




క్రీడలను ప్రోత్సహించడం కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకొండ విజయరామరాజు అన్నారు సోమవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రినగర్ వద్ద సీఎం కప్ టార్చి రిలే క్రీడా జ్యోతి ర్యాలీని ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. అనంతరం శాస్త్రి నగర్ నుండి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ సుల్తానాబాద్ క్రీడాకారులకు పుట్టినిల్లు అని, పలువురు సుల్తానాబాద్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని సుల్తానాబాద్ కు గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి ప్రతి మండల, జిల్లా హెడ్ క్వార్టర్స్ లలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తో పాటు పలు క్రీడలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతోనే క్రికెటర్ సిరాజ్ జానీ, నికిత్ జరిన్ లకు డిఎస్పి ఉద్యోగాలు ఇచ్చారని, వరంగల్ క్రీడాకారుడికి కోటి రూపాయల నగదును అందించి వరంగల్ నగరంలో ఆరు వందల గజాల స్థలాన్ని కేటాయించి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం క్రీడారంగంలో రాణించిన పలువురు క్రీడాకారులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, డివైస్ ఓ సురేష్, కాంగ్రెస్ నాయకులు మినుపాల ప్రకాష్ రావు, అంతటి అన్నయ్య గౌడ్, సాయిరి మహేందర్, వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల రవీందర్ లతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాక.. ప్రజలకు ఇబ్బందులు

**- గ్రామస్తులు కోరిన పట్టించుకోని అధికారులు - బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ పనులను ఆపినా వైనం**
**- రోడ్డు ప్రమాదాలతో బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తికాక ప్రాణాలు పోతున్నాయని పలు గ్రామాల ప్రజల ఆవేదన**
**- ఇప్పటికి ఆరుగురు మృత్యువాత**

**సూర్య కామారెడ్డి బ్యూరో**

బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తికాక తాత్కాలికంగా వేసిన రోడ్డుతో 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆరుగురు మృత్యువాత పడ్డారు. అయినా అధికారులు చలించడం లేదు. బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తికాక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఈ రోడ్డు వెంట వెళ్లే రామరెడ్డి, పోసానిపేట్, గిద్ద, రెడ్డిపేట్, రాధాయిపల్లి, గోకుల్ తండా, అన్నారం, మోషన్ పూర్ రాజమ్మ తండా, కన్నాపూర్, కన్నాపూర్ తండాతో పాటు నిజాంబాద్ జిల్లా పరిధిలోని తూంపల్లి, కొండాపూర్, గడుకోల్ తదితర గ్రామాల ప్రజలు నిత్యం ద్విచక్ర వాహనాలపై వేలాదిమంది వెళు న్నారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైన పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్ సగం వరకు పనులు చేసి వదిలిపెట్టారు. నిధులు ఇవ్వడం లేదని పనులు చేయడం లేదని కాంట్రాక్టర్ వాపోతున్నాడు. దీంతో ఈ ప్రాంతం నుంచి ప్రయాణించే ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. గతంలో ఉన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కామారెడ్డి ఎమ్మెల్యే గంప



గోవర్ధన్లు గంగమ్మ బ్రిడ్జి నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ స్లాబ్ లెవెల్ వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు జరిగిన బిల్లులు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపి చేతులెత్తేశారు. స్థానిక ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు బ్రిడ్జి నిర్మాణం పనులపై ఈ ప్రాంత ప్రజలు వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రాణాలు పోతున్నాయని చెప్పడంతో సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులను ఎమ్మెల్యే వెంటనే ఆదేశాలు జారీ చేశారు. పనులు పూర్తి చేయాలని కోరిన కూడా నెలరోజుల్లో పూర్తిచేస్తామని చెప్పిన అధికారులు ఆరు నెలలు అవుతున్న పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి లారీ లోడుతో వెళ్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు తాత్కాలికంగా వేసిన మొరం రోడ్డు గుంతల మయం కావడంతో పెద్ద వాహనాలు వస్తే బోల్తాపడడం జరుగుతుందని రామారెడ్డి జేఏసీ నాయకులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు. నిత్యము ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టించుకోవాలని అధికారులను కోరుతున్నారు. కాంట్రాక్టర్కు బిల్లు ఇప్పించి పనులు పూర్తి చేయించాలని వారు కోరుతున్నారు. లేకుంటే వారం రోజుల వరకు వేచి చూసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని రామారెడ్డి జేఏసీ నాయకులు తెలిపారు. సుమారు 10 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని అందరికీ ఇబ్బందులు జరుగుతున్నాయని రాత్రి వేళలో మరిన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

# త్వరలో మున్సిపల్ కేంద్రంగా మారనున్న బిచ్కుంద




**సూర్య కామారెడ్డి జిల్లా బ్యూరో**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం కేంద్రంగా ఉన్న బిచ్కుంద నియోజకవర్గాన్ని మున్సిపల్ గా మారేందుకు రంగం సిద్ధం అవుతుంది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆమోదం పొందిన తర్వాత ప్రతిపాదనలు జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి పంపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం బిచ్కుంద పట్టణ జనాభా 13,213 ప్రస్తుతం 17,480గా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బిచ్కుంద పట్టణ జనాభా 13,213 ఉండగా ప్రస్తుతం 17,480గా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు 15 వేలకు మించిన జనాభా ఉండడంతో పురపాలికగా మార్చే ప్రతిపాదనకు తీరుపై అధికారుల ఆలోచనలు చేస్తున్నారు.

**- పరిశీలనకు ప్రత్యేక బృందం**

ప్రస్తుతం గ్రామపంచాయతీగా ఉన్న బిచ్కుంద ఆదాయ వ్యయాల పరిశీలనకు పట్టణాభివృద్ధి శాఖకు చెందిన ప్రత్యేక బృందం త్వరలో పర్యటించనుంది. మండల కేంద్రంలోని ఇతర సౌకర్యాలు ఆదాయ పెంపకం ఉన్న మార్గాలు పరిశీలిస్తారు. మౌలిక వసతులు కల్పించి ప్రగతి పనులు చేపడితే బిచ్కుంద పట్టణం మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నది అన్నారు. ముఖ్యంగా నిధులకు ప్రగతి కుంటుపడుతుందని పురపాలకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు అయ్యే అవకాశాలు నిండుగా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బారసా ప్రభుత్వ హయాంలో అడుగులు బరాస ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఎమ్మెల్యే హన్మంత్ షిండే రావడంతో బిచ్కుంద, పిట్లం పంచాయతీలను పురపాలికలుగా మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. పరిశీలించిన జిల్లా యంత్రాంగం బిచ్కుంద ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించింది ఆ తర్వాత పట్టణాభివృద్ధి శాఖకు చెందిన అధికారులు సైతం పర్యటించి నివేదికలు తయారు చేశారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రతిపాదన అటకెక్కిం ది.ప్రస్తుతం ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు సూచనలతో జిల్లా పంచాయతీ అధికారులు మరోసారి ప్రతిపాదనలు రూపొందించి కలెక్టర్ కు నివేదించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆమోదముద్ర వేసి దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపగా పట్టణాభివృద్ధి శాఖకు చేరింది. పురపాలికగా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నివేదించినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ వెల్లడించారు.

## బస్ స్టేషన్లో ప్రయాణీకుల రద్దీని పర్యవేక్షించిన రీజనల్ మేనేజర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ డా.బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్లో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎన్. సుచరిత బతుకమ్మ, దసరా పండగలకు వచ్చి తిరుగు ప్రయాణములో భాగంగా వివిధ రూట్లలో ప్రయాణీకుల రద్దీని పర్యవేక్షించారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సురేశ్, స్టేషన్ మేనేజర్ ఎన్. అంజయ్యలకు సూచించారు. ప్రయాణీకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. ప్రయాణీకుల సౌకర్యార్థం దాదాపు 200 అదనపు బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్తో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) కె. సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీ సి.హెచ్. వెంకటేశ్వర్లు, కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ. విజయమాధురి వున్నారు.

## వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో చేపట్టబోయే అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని కోరుతూ కరీంనగర్ ఎంపి కేంద్రమంత్రి బండి సంజయ్ ని హుజురాబాద్ బిఆర్ఎస్ నాయకులు, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి. ఇమ్రాన్ కోరారు. ఇటీవల కరీంనగర్ లో ఎంపి బండి సంజయ్ని కలిసి విజ్ఞప్తి చేయగా ఎంపి బండి సంజయ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## కరీంనగర్లో విస్తృతంగా పర్యటించిన
## ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్-నిజామాబాద్-అదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్ రెడ్డి కరీంనగర్లోని పలు విద్యాసంస్థలు సందర్శించినారు.ఈ సంధర్బంగా ఉపాధ్యాయులతో, అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించి పట్టభద్రుల ఓటర్ అవశ్యకతను వివరిస్తూ అదేవిధంగా విస్తృత పర్యటన భాగంగా వారు నగర కేంద్రంలోని భవిష్యనిధి కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించి రానున్నటువంటి పట్టబదుల శాసనమండలి ఎన్నికలలో తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపి పట్టభద్రులను సంక్షేమానికి చేయూత నియమాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులకు అన్ని రంగాలలో ప్రాధాన్యం కల్పించడమే కాకుండా వారికి ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలుపుతూ పట్టభద్రులు సమాజ అభివృద్ధికి కీలకమని అభివర్ణిస్తూ వారి భవిష్యత్తుపై భరోసాగా ఉంటానని అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు విద్యాసంస్థల యజమాన్యాలు ఉపాధ్యాయులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**సూర్య కామారెడ్డి బ్యూరో**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, వ్యవసాయం, పాక్స్, తదితర శాఖల అధికారులతో వరి కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ, రెండు, మూడు రోజుల్లో వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పూర్తయిందని, కొనుగోళ్లు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 419 వరి కొనుగోళ్ళ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో 392 వ్యవసాయ పరపతి సంఘం(పాక్స్), 27 ఐ.కే.పి. కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన తేమ కొలిచే యంత్రం, టార్పాలిన్, గాని సంచులు, ఫ్లెక్సీ, త్రాగునీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సి.ఎం.ఆర్. సేకరణ పూర్తి చేయాలని, మిలర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, జిల్లా సహకార అధికారి, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**సూర్య కామారెడ్డి జిల్లా బ్యూరో**



కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా పోచారం మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎటువంటి నష్టం జరగకూడదు అని రైతు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, వాన కాలం పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన సన్నం రకం దాన్యానికి ప్రోత్సహకంగా క్వింటాలుకు 500/-బోనస్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కావున రైతులు సద్వినియోగ పరచుకోవాలని, రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోకూడదని, ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 2320/- రూపాయలకు, కామన్ గ్రేడ్ 2300/-రూపాయలకు కొనుగోలు చేస్తుందని, రైతులు శుభ్రం చేసి పొల్లు లేకుండా, తేమ 17% లోపు ఉండేల కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, దుద్దాల అంజిరెడ్డి, ఏజాస్, పట్టణ ప్రజాప్రతినిధులు, తదితర నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల నిరసన

**సూర్య, హుజురాబాద్**



ఇటీవల వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల సోమవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసనను ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పూలే ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సందెల వెంకన్న మాట్లాడుతూ పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని అన్నారు. విగ్రహాలను కూల్చడం, ధ్వంసం చేయడం వల్ల మహాత్ముల చరిత్రను చెరిపి వేయలేరని, మహా త్ముల విగ్రహాలను కూల్చి వేస్తున్న, ధ్వంసం చేస్తున్న సంఘ విద్రోహ శక్తులపై కఠినమైన చట్టాలను ప్రయోగించాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు చందుపట్ల జనార్ధన్, పసుల స్వామి, మాడుగుల ఓదెలు, ములుగు రవి, ఏనూరి అశోక్, తాళ్లపల్లి అమరేందర్, కోడూరి సమ్మయ్య, చల్లూరి రాజు, సిరికొండ సమ్మయ్య, గిరవేణి శ్రీకాంత్, మిడిదొడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జడల రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన జీవిఆర్

**సూర్య-మానకొండూర్**



మానకొండూర్ మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి జడల రవి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ సుడా చైర్మన్ జి.వి.రామకృష్ణారావు సోమ వారం పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శలో వీరితో పాటు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం సంపత్, పిండి సందీప్, కొమ్ము రవి ఉన్నారు.



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

రాజన్నసిరిసిల్ల
మంగళవారం 15 అక్టోబర్ 2024 7


## ప్రాణం తీసిన అతివేగం.. చెట్టును బైకు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం..

### - హన్మాజీపేటలో పండుగ పూట రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు

**సూర్య, వేములవాడ**

ద్విచక్ర వాహనం చెట్టును బలంగా ఢీకొనడంతో ఇద్దరి యువకులు దుర్మరణం చెందిన విషాద సంఘటన వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. హన్మాజీపేట గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్ (22) సురా అనిల్ (21) అనే ఇద్దరు స్నేహితులు గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అప్పటివరకు ఎంతో సంతోషంగా వున్న ఇద్దరు మిత్రులు దుర్గామాత నిమజ్జనం తర్వాత నూతనంగా కొనుగోలు చేసిన బైకుపై సరదాగా మామిడిపల్లి వైపు వెళ్లారు. అతివేగంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 కి సమాచారం అందించిన స్పందించకపోవ డంతో అటువైపుగా పెట్రోలింగ్‌కు వచ్చిన



పోలీసులు క్షతగాత్రులను తమ పోలీస్ వాహనంలోనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాలను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరి యువకులు అర్థాంతరంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు





బంధుమిత్రుల రోదనలతో హన్మాజీపేట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.



## సూర్య,రంగనాయక తిరుప్పోలం, చంద్ర వాహనాల పై ఊరేగిన శ్రీవారు

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రోజున స్వామివారు మూడు వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశాల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు అత్యంత వైభవంగా వేదమూర్తులై న బ్రాహ్మణోత్తముల సమక్షంలో జరుగుతున్నాయి. నేటి ఉదయం సూర్య వాహనంపై స్వామివారు సతీస మేతంగా ఊరేగగా సాయంత్రం రంగనాయక తిరుప్పోలంపై,రాత్రి చంద్ర వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆ వైకుంఠ వాసుడు దేవాలయ మాడ వీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి మొక్కలు చెల్లించుకున్నారు.

## కోత విధించకుండా కొనుగోలు చేయండి

### - డిప్యూటీ తహసీల్దారుకు వినతి

**సూర్య, ఎల్లారెడ్డిపేట**



రైతులు ఆరు గాలం శ్రమించి పండించిన వడ్లను కోతలు లేకుం డా కొనుగోలు చేయాలని రైతులు డిప్యూటీ తహశీల్దార్ కు వినతి పత్రం అందించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతులు సోమవారం మాజీ ఎంపిటిసి ఒగ్గు బాలరాజు యాదవ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందించారు. పత్తి, వరి ధాన్యం కొనుగోలులో కోత విధించకుండా చూడాలని, ధాన్యం తూకం వేసిన తర్వాత రోజుల తరబడి వేచి ఉంచి బరువు తగ్గిందని కటింగ్ పెట్టి రైతులపై భారం వేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో రైతులు అల్లం శ్రీకాంత్, మార్వాడీ నర్సయ్య, రవీందర్ రెడ్డి, బాబా, బొమ్మన వేణి నర్సింలు, పాటి కుమార్, నరేందర్ గౌడ్,నిమ్మ శ్రీనివాస్, మాందాటి రాము యాదవ్, మందాటి సతీష్ యాదవ్, మాందాటి లక్ష్మణ్ యాదవ్, బల్యాల శ్రీనివాస్, చొక్కి రవీందర్, గుండె మదు తదితర రైతులు పాల్గొన్నారు.

## మృతి చెందిన అంగన్‌వాడి టీచర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

### -ప్రభుత్వ పరంగా రూ.20వేల అందజేత

**సూర్య గంభీరావుపేట**



ఆదివారం రోజున గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామానికి అంగన్ వాడి టీచర్ కర్ణింగ్ భారతమ్మ గుండెపోటుతో మృతి చెందడంతో, భారతమ్మ మృతి విషయాన్ని కాంగ్రెస్ పార్టి సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన గంభీరావుపేట మండలం అధ్యక్షులు ఎండి హమీద్ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు .మృతురాలి కుటుంబానికి తక్షణ సహాయంగా దహన సంస్కారాలు ఖర్చు అందజేసే రూ. 20వేల చెక్కును డిడబ్ల్యూఓ అధికారి లక్ష్మీరాజ్యం,అధికారులు అందజేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత ప్రధాన కార్యదర్శి కొండికొప్పుల పద్మ, గంభీరావుపేట మండలం అధ్యక్షురాలు కల్లట్ల మంజుల ప్రాజెక్టు సీడీపీఓ ఉమారాణి సూపర్ వైజర్ రేణుక మాజీ సర్పంచ్ అక్కపెల్లి బాలయ్య సీనియర్ నాయకులు జంగం రాజు ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి గాయత్రి పుట్టినరోజు వేడుకలు

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండలం కొత్తపేటలో మాజీ ఏఎంసి డైరెక్టర్ చిందం వేణు కూతురు గాయత్రి పుట్టినరోజు ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ఘనంగా చేశారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. పలువురు చిన్నారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## యారన్ డిపో ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన ఆసాములు

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్లలో యారన్ బ్యాంక్ ఏర్పా టు చేయడంపై సిరిసిల్ల ఆసాముల సంఘ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 30 ఏళ్లుగా ఎదురు చూసిన యారన్ బ్యాంకు ఏర్పాటుతో పాటు 50 కోట్లు నిధులు విడుదల చేయడానికి కృషి చేసిన కేకే మహేందర్ రెడ్డి,ఆది శ్రీనివాస్,పొన్నం ప్రభాకర్ లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను ఆసాముల సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. అనంతరం పవర్లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ,ప్రభుత్వం చీరల ఆర్డర్లపై చర్చించినట్లు ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. దీనిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని ఈ నెలలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున వారితోటే మాట్లాడించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రాజు,ఆడెపు సాగర్,సత్యనారాయణ రెడ్డి,సిరిసిల్ల సుమన్, ఆమంచ సదానందం,అడ్డగట్ల భాస్కర్,దూస అశోక్,చిలుక రాజు,రమేష్,పులి ఎల్లయ్య,బొల్లి భాస్కర్ పాల్గొన్నారు.

## నూతనంగా ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారికి సన్మానం

**సూర్య రుద్రంగి**



రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఐదుగురు డిఎస్సి 2024లో ఎంపికైన వారిని సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రానికి చెందిన యువతీ, యువకులు ఐదుగురు డీఎస్సీ 2024 ద్వారా ఎన్నికై ఉపాధ్యాయ వృత్తిలోకి అడిగడుతున్న అభ్యర్తులైన గడప వేణు కుమార్, లింగంపల్లి రవి,శీలం మానస, తర్రె సంగీత, రవిలను సన్మానం చేయడం జరిగిందన్నారు. ఎంతో శ్రమ పడి ప్రభుత్వ ఉపాద్యాయులుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియ చేస్తూ,భవిష్యత్ లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలేనని కోరారు. రుద్రంగి మండల కేంద్రంలో వీరు ఉపాధ్యాయులుగా ఎన్నిక కావడం ఈ ప్రాంత యువతకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ సెక్రెటరీ బండి యాదగిరి,ట్రెజరర్ కొమిరే శంకర్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ తిపిరెడ్డి వెంకట్ రెడ్డి, డిస్ట్రిక్ట్ సపోర్టింగ్ టీం మెంబర్ గడప రఘుపతిరావు, పాస్ట్ ప్రెసిడెంట్స్ అంబటి శంకర్, కర్నవత్తుల దేవేందర్ రావు, పుట్కపు మహేష్, మంచే రమేష్, మంచే రాజేశం పాల్గొన్నారు.

## న్యాయవాదులను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్


**సూర్య సిరిసిల్ల టౌన్**



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రచారంలో భాగంగా సోమవారం పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ సభ్యులను, న్యాయవాదులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా,న్యాయవాదిగా,విద్య వంతుడిగా మీ ముందుకు వస్తున్నానని ఆశీర్వదించాలని కోరారు. న్యాయవాదులు ఎదుర్కొం టున్న ప్రతి సమస్యకు పరిష్కార దిశగా పనిచేస్తానని,గెలిచిన వెంటనే పట్టభద్రులందరికి 1 రూపాయికే హెల్త్ ఇన్స్యూరెన్స్ పథకాన్ని ప్రవేశ పెడతానని హామీ ఇచ్చారు. మీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు.

## ప్రభుత్వ విప్‌ను కలిసిన ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులు

**సూర్య, వేములవాడ**



ఇటీవల జరిగిన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల్లో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా వేముల వాడ పట్టణానికి చెందిన బుస్స దశ రథం, వేములవాడ పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా సిద్దాంశెట్టి వేణు గెలుపొందగా సోమవారం వారు సంఘం సభ్యులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు, గెలుపొందిన బుస దశరథం, సిద్ధం శెట్టి వేణు లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి సన్మానిం చారు. నూతన అధ్యక్షులకు ప్రభుత్వ విప్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

**సూర్య ముస్తాబాద్**



మహర్షి పబ్లిక్ స్కూల్‌కి చెందిన కొండం సాయి తేజగౌడ్ ఈ నెల 4వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రములో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్14 క్రికెట్ సెలక్షన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జలజ తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినిని కేకే మహేందర్ రెడ్డి పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి,గల్ఫ్ ఎన్ఆర్ఐ సెల్ తోట దర్మేందర్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# వారి ప్రతిభకు తల వంచిన కొలువులు

### వ్యవసాయంతో పాటు పాల వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్న..




రంగినేని శ్రీనివాసరావు – వనజల కూతురు పల్లవి మొదటి నుండి కష్టపడి చదివి ఇటీవలే 2024 రహదారులు & భవనాల శాఖ లో ఏఈఈ గా సిరిసిల్లలో ప్రభుత్వ ఉద్యోగం సాధించింది.

### సఫాయి కార్మికుడి కొడుకు సిపాయిగా...



అంగూరి నర్సయ్య– నర్సవ్వ గ్రామపంచాయతీ సఫాయి కార్మికుడు గా విధులు నిర్వహిస్తు న్నాడు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో పుట్టిన అంగూరి బాలనర్సు ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రాంగా ఉన్న కృషి పట్టుదలతో చదివి 2017లో (సిఐఎస్ ఎఫ్ ) సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ నేషనల్ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి. ప్రస్తుతం ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్నాడు.

### హెూంగార్డ్ కుటుంబం నుంచి..



పసుపునూరి గోపికృష్ణ – రమ్య హెూంగార్డ్ గా విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి బాటలోనేను అంటూ పసుపునూరి వంశీ దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో చిన్నప్పటినుండి పోలీస్ జవాన్ కావాలనే తపనతో పుస్తకాలకే పరిమితమై 2023లో ఆర్మీలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ఉత్తరాఖండ్ లో విధులు నిర్వహిస్తున్నాడు.

### వ్యవసాయ కుటుంబంలో ఇద్దరికి పోలీస్ ఉద్యోగం..





పాక లింగం యాదవ్– దేవవ్వ వ్యవసాయ కుటుంబం. కుమారులు తల్లిదండ్రులకు వ్యవసాయ పనులకు చేదోడు వాదోడుగా ఉంటూ సొంతంగా చదివేవారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఆకాంక్షతో ఇద్దరు అన్నదమ్ములలో ఒకరు చిన్న కుమారుడు పాక రంజిత్ యాదవ్ ఆర్మీలో అగ్నిపత్, పెద్ద కుమారుడు పాక వేణు యాదవ్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం వీరిద్దరూ ట్రైనింగ్ లో ఉన్నారు.

### వ్యవసాయ కుటుంబం నుండి..



తొట్ల పెద్ద మల్లయ్య – లక్ష్మీ వ్యవసాయం చేస్తుంటారు. చిన్న కుమా రుడు తొట్ల కుమార్ యాదవ్ తల్లిదండ్రులకు వ్యవసాయ పనులలో చేదోడువాదోడుగా ఉంటూ ఇంటి వద్ద సొంతంగా ప్రిపేర్ అయ్యేవాడు. చిన్నప్పటినుండి టీచర్ కావాలనే తపన తో ఇటీవల వెలువడిన డీఎస్సీ 2024 ఫలితాలలో 22వ ర్యాంకు సాధించి ఎస్ జి టి టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

### బీడీ కార్మికురాలి ఇంట్లో మెరిసిన విద్య కుసుమం..



చింతల శ్రీనివాస్ –అరుంధతి లు ఇద్దరు బీడీ కార్మికులే.వీరి చిన్న కుమార్తె చింతల విద్యారాణి చిన్నప్పటినుండి కృషి పట్టుదలతో చదివింది. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తపనతో పుస్తకాలకే పరిమితమై 2024 డీఎస్సీలో 33వ ర్యాంకు సాధించి ఎస్ జి టి టీచర్ ఉద్యోగానికి ఎంపికైంది.బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియాగం నియామక పత్రం అందుకుంది.

### తల్లి తండ్రులు,భర్త ప్రోత్సాహంతో...



ధ్యాన బోయిన మమత – రాజు దాదాపు 13 సంవత్సరాలు కాంట్రాక్టు పద్ధతిలో టీ జి టి గా పనిచేసి ఇటీవల ట్రైనడ్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగం సాధించింది. కరీంనగర్ జిల్లా చింతకుంట సోషల్ వెల్ఫేర్ స్కూల్ బాలికలకళాశాలలో విధులు నిర్వహిస్తుంది.

### భర్త సహకారం..స్టాఫ్ నర్స్ గా ఉద్యోగం..



ఆశయ్య గారి గౌతమి – రత్నాకర్ చిన్నప్పటి నుండి కష్టపడి చదివి బి ఎస్ సి నర్సింగ్ చేసి చాలా సంవత్సరాలు కాంట్రాక్ట్ బేసిక్ లో పనిచేసే ఇటీవలే స్టాఫ్ నర్సుగా ప్రభుత్వం ఉద్యోగం సాధించి, కామారెడ్డి మెడికల్ కాలేజ్ లో విధులు నిర్వహిస్తుంది.తమ గ్రామానికి గర్వ కారణంగా నిలిచిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

# పరిశుభ్రమైన చేతులు – ఆరోగ్య ప్రదాతలు

## – జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రతినిత్యం, అత్యవసర, అతి ముఖ్య సమయాలలో తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, తద్వారా చేతుల అపరిశుభ్రత వల్ల వచ్చు అనేక వ్యాధులను దూరం చేసుకోగలుగుతామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. అక్టోబర్ 15 ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా యూనిసెఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యానర్ ఆవిష్కరిస్తూ ప్రజలందరికీ, ప్రత్యేకంగా పారిశుధ్య పనులలో నిమగ్నమయ్యే కార్మికులకు, చేతుల పరిశుభ్రత విషయాన్ని చేరవేయాలని,




యూనిసెఫ్ ఈ దిశగా తమ వంతు ప్రయత్నం చేస్తుందని ఉద్ఘాటించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో, పాఠశాలల్లో, మహిళా సంఘాల సమావేశాల్లో,చేతుల శుభ్రత – ఆరోగ్య భద్రత అంశాన్ని విస్తృత ప్రచారం చేయాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సహాయ కలెక్టర్ (శిక్షణ )అజయ్ యాదవ్, అధికారులు డిఆర్డిఓ శ్రీధర్, సీఈవో శ్రీనివాస్ ,డిపిఓ రవీందర్ ,మున్సిపల్ కమిషనర్ చహత్ బాజ్పాయ్, డీఈవో జనార్ధన్ రావు, యూనిసెఫ్ రాష్ట్ర ప్రతినిధి కాశీనాథ్, జిల్లా సమన్వయ కర్త కిషన్ స్వామి, ఎస్పిఎం రమేష్, వేణు, కళ్యాణి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలి

## – ప్రజావాణి ఫిర్యాదులు: 22 – అదనపు కలెక్టర్ పి. రాంబాబు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. రాంబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గౌతమ్ రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు




ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 22 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, ఆర్డీవోలు, మధు సుధన్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంత రావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

## -కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సూర్య రాజన్న సిరిసిల్ల**



సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వాటిని పరిష్కరించాలని వివరించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దని స్పష్టం చేశారు. సోమవారం నాటి ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 27, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 4, ఉపాధి కల్పన శాఖకు 3, ఎస్సీ కార్పొరేషన్, వ్యవసాయ శాఖ, నీటి పారుదల శాఖకు రెండు చొప్పున, ఎంపీడీఓ తంగళ్లపల్లి, ఎల్లారెడ్డి పేట, సర్వే, అటవీ శాఖ, ఎల్ డీ ఎం, మున్సిపల్ సిరిసిల్ల, ఎక్సైజ్ శాఖ, డీ సీ ఎస్ ఓ, డీ ఎస్ సీ డీఓ, సెస్ శాఖలకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మత్తు వైద్యుడు లేడని నిలిచిన ఆపరేషన్లు

## - గంటల కొద్ది ఆపరేషన్లకై నిరీక్షించిన గర్భిణీలు

**సూర్య, హుజురాబాద్**

మత్తు వైద్యుడు అందుబాటులో లేదని గర్భిణీ స్త్రీలకు చేయాల్సిన సి – ఆపరేషన్లు నిలుపుదల చేయడంతో తీవ్ర నొప్పులతో గర్భిణీ స్త్రీలు అవస్థలు పడ్డారు. హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఉదయం ప్రసవం కోసం ఆరుగురు గర్భిణీ స్త్రీలు ఆసుపత్రికి వచ్చారు. వీరికి ఆపరేషన్ కోసం ఆసుపత్రి సిబ్బంది యూరిన్ కేథటర్ వేసి సిద్ధంగా ఉంచారు. కాగా మత్తు డాక్టర్ అందుబాటులో లేదని, ఇప్పుడే ఆపరేషన్లు చేయమని వైద్యూలు తెలిపింది. ఉదయం నుండి సాయంత్రం వరకు మత్తు డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న గర్భిణీ స్త్రీలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆరుగురు గర్భిణీ స్త్రీల అవస్థలు చూసి వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా మత్తు డాక్టర్ వస్తే ఆపరేషన్ చేస్తామని వారు వివరించారు. కానీ సాయంత్రం వరకు కూడా మత్తు డాక్టర్ రాకపోవడంతో ఆందోళన చెందిన గర్భిణీ స్త్రీలకు సంబంధించిన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఏరియా ఆసుపత్రి వైద్య ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మత్తు డాక్టర్ ను పంపించగా రాత్రి 6.30 గంటల సమయంలో ఆపరేషన్లు మొదలయ్యాయి. కాగా ఉదయం నుండి సాయంత్రం వరకు మత్తు డాక్టర్ లేకపోతే ఆయన స్థానంలో మరొక డాక్టర్ ను ఏర్పాటు చేసి గర్భిణీ స్త్రీల అవస్థలు తీర్చాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం పట్ల గర్భిణీ స్త్రీల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం అయినా మీడియా వల్ల తమకు ఆపరేషన్లు జరిగాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.

# ఉడిపి హెూటల్ సీజ్

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల గణేష్ భవన్ ఉడిపి హెూటల్లో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష సోమవారం తనిఖీ చేశారు. నిన్న ఉదయం ఓ మహిళా కస్టమర్ కొనుగోలు చేసిన ఇడ్లీలో జెర్రీ కనిపించగా, ఆమె ఉడిపి హెూటల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు.

# జర్నలిస్ట్ యూసూఫ్‌పై పెట్టిన అక్రమ కేసు వెంటనే ఎత్తివేయాలి

## - టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్, సిపికి వినతి

**సూర్య కొత్తపల్లి**

జర్నలిస్టు ఎండి యూసుఫ్‌పై చందుర్తి పోలీస్ స్టేషన్లో పెట్టిన అక్రమ కేసును తొలగించి, అతనిని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే తిరుపతి, కే బాపూరావులు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. కేసుకు సంబం ధించిన వివరాలను కలెక్టర్, సిపి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీసులు ఇటీవల



తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు ఎండి యూసుఫ్‌కు సంబంధంలేని ఒక కేసును అంటగట్టి అతనిపై అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. యూసుఫ్ పై పెట్టిన తప్పుడు కేసును ఉపసంహరింపజేసి, అతనిని వెంటనే విడుదల చేయాలని కోరారు. తప్పు చేయని జర్నలిస్టులపై ఇలా తప్పుడు కేసులు పెట్టడం తగదు. ఈ సంఘటనపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చట్ల శంకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్, నరేష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పెరుక రవి జర్నలిస్టులు, ప్రసాద్, అంజయ్య, శంకర్ రెడ్డి, రవీందర్, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ జాప్యం

## - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**సూర్య, వీణవంక**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, ముఖ్యంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేసి, ప్రజల వ్యతిరేకతను మూట కట్టుకుంటుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. సోమవారం వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో బిజెపి మెంబర్ షిప్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ బిజెపి మెంబర్ షిప్ డ్రైవ్ ముగింపుకు సమయం దగ్గర పడిందని, వీణవంక మండలంలోని నాయకులు, కార్యకర్తలందరూ మెంబర్ షిప్ డ్రైవ్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజలకు వివరించి బిజెపి సభ్యత్వ నమోదులో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని అన్నారు.



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్యపెట్టే రీతిలో మేనిఫెస్టోను రూపొందించిందని అన్నారు. అధికారంలోకి వచ్చి 300 రోజులు గడిచిన మేనిఫెస్టో లోని అంశాలను నెరవేర్చకుండా దాటవేతధోరణి అవలంబిస్తుందని అన్నారు. ముఖ్యంగా సీజన్ ముగిసిన రైతు భరోసా సహాయం అందించ లేదని, రెండు లక్షల రుణమాఫీ రైతులందరికీ వర్తించలేదన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగుల భర్తీ కార్యక్రమం అటకెక్కిందన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లను పెంచలేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2500 నేటికీ అందించకుండా అర్హులైన మహిళలకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. హామీలను అమలు కోసం ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరించి నెలలు గడిచిపోయిందని, వాటిని ఎందుకు స్వీకరించిందో? దరఖాస్తుల పరిస్థితి ఏంటో? తెలియని పరిస్థితి ఉందని అన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రోజుకో రాజకీయ డ్రామా చేస్తుందని అన్నారు. కులగణన పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ ఓ డ్రామా చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, జిల్లా సభ్యత్వ నమోదు కో కన్వీనర్ చెన్నమాధవుని నర్సింహా రాజు, మండల ప్రధాన కార్యదర్శి సదానందం, నాయకులు గణపతి సారయ్య, ఎంపీటీసి మోరే స్వామి, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో చెరువుల హద్దుల నిర్ణయం

**- తహశీల్దార్ కనకయ్య**

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని చెరువుల, కుంటల హద్దులను త్వరలోనే నిర్ణయించడం జరుగుతుందని హుజురాబాద్ తహశీల్దార్ కే. కనకయ్య అన్నారు. తమ భూములు ఎఫ్టిఎల్, బఫర్ జోన్ లో ఉన్నాయో తెలియక ఆందోళనలో ఉన్న ప్రజల విషయాన్ని సోమవారం తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ పట్టణంలో మోడల్ చెరువు, గుండ్ల చెరువు, గంగోని కుంటలతో పాటు పలు కుంటలు ఉన్నాయని, వీటి హద్దుల నిర్ణయం అతి త్వరలోనే నిర్ణయించడం జరుగుతుందని అన్నారు. ఏ ఏ సర్వే నెంబర్లలో చెరువులు, కుంటలు ఉన్నాయో వాటి విస్తీర్ణం హద్దులు అన్ని కొలతలు వేసి వాటికి హద్దురాలు వేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రజల్లో ఉన్న అనుమానాలు, భయాందోళనలు తీసివేయడం కోసం వీటిని కొలవడం జరుగుతుందని అన్నారు. ఎవరికి ఎలాంటి అనుమానాలు ఉన్నప్పటికి రెవెన్యూ అధికారుల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. ప్రతి చెరువు కింద కొంత ఆయకట్టు ఉంటుందని, వాటిని ఇతర అవసరాలకు వినియోగించడానికి అనుమతులు ఉండవని అన్నారు.

## విశ్వ బ్రహ్మణ సంఘానికి భూమి పూజ

**సూర్య ముస్తాబాద్**

ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామానికి చెందిన విశ్వ బ్రహ్మణ సంఘము ఆధ్వర్యములో సంఘనికి భూమి పూజ చేశారు.



## పెద్ద లింగాపూర్‌లో పోలీసుల విధులకు ఆటంకపరిచిన ఇరువురిపై కేసు నమోదు

**సూర్య. ఇల్లంతకుంట..**

మండలంలోని పెద్ద లింగాపూర్‌లో దుర్గామాత నిమజ్జనంలో బందోబస్తు విధులను నిర్వహిస్తున్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ ముందుకు పంపించే క్రమంలో గుర్రాల సంతోష్ రెడ్డి, సుమన్ రెడ్డి లు ఇరువురు వెళ్ళం అని దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకపరిచిన కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే. శ్రీకాంత్ గౌడ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆదివారం పెద్ద లింగాపూర్ లో దుర్గామాత నిమజ్జనం కోసం ముందస్తుగా బందోబస్తూ కోసం పోలీస్ హెడ్ కానిస్టేబుల్,పోలీస్ కానిస్టేబుల్ వెళ్లారు. దుర్గామాత ఊరేగింపులో మందుకు పంపే యత్నంలో రాత్రి 1.30 గంటలకు అదే గ్రామానికి చెందిన గుర్రాల సంతోష్ రెడ్డి,సుమన్ రెడ్డిలు వెళ్ళము అంటూ,దురుసుగా ప్రవర్తించి డ్యూటీ లో ఉన్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ను నెట్టివేస్తూ,దుర్భషాలాడినట్లు, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.విధుల్లో ఉన్న సిబ్బంది పై,విధులకు ఎవరైన ఆటంకపరిచి నట్లయితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## నూతన గ్రంధాలయ ఛైర్మన్‌కు సన్మానం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ గ్రంధాలయం ఛైర్మన్గా నియమితులైన సత్తు మల్లయ్య పదవి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి టిఎన్జీవోల జిల్లా అద్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వ ర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే, శాలు వాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాసరెడ్డి, సంఘెం లక్ష్మణరావు, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ఒంటెల రవీందర్ రెడ్డి, రాజేశ్వరరావు, మల్కా రాజేశ్వరరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యదర్శి శంకర్ రాజ, మల్లయ్య, సరిత, అనిల్ తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## పెన్షన్ దారులలో అనార్హులను గుర్తించాలి

**- సిపిఐ నాయకులు డిమాండ్**

**సూర్య గన్నేరువరం**



గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్నటువంటి అనార్హులైనటువంటి పెన్షన్‌దారులను గుర్తించి వెంటనే తొలగించాలని సోమవారం సిపిఐ నాయకులు స్థానిక ఇంచార్జ్ ఎంపీడీఓకి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మాఖ్యమంత్రి అనర్హులను గుర్తించి వారిని వెంటనే తొలగిస్తామని అని, దీనిపై ప్రత్యేక కమిటీ వేసి అనర్హులును గుర్తించాలి అని అన్నారు. అలాగే మండలంలోని వారిని గుర్తుంచాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేసారు. ఇట్టి కార్యక్ర మంలో మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, కోశాధికారి ఘర్షకుర్తి శ్రీనివాస్, మండల నాయకులు కూన మల్లయ్య, బోయిని మల్లయ్య, కూన కిష్టయ్య, ఎండీ నాయ్యిమ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రెటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మంజూరు చాలా సంతోషం

**- కాంగ్రెస్ నాయకులు రావుల శ్రీనివాస్ గౌడ్**

**సూర్య తిమ్మాపూర్**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెం పల్లి గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు పదినెలలు అయినదాని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారం టీలు మాట ఇచ్చి పని చేస్తున్నదాని, మానకొం డూర్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంఎల్ఏ డాక్టర్ కావ్వంపల్లి సత్యనారా యణ పట్టుబట్టిన విక్రమార్కుడిలా తిమ్మాపూర్ మండలంలోని యాదవుల పల్లిలో 20 ఎకరాల స్థలం లో ఇంటిగ్రెటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ మంజూ రు చేయించి వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌చే భూమి పూజ చెయ్య డం పట్ల వారికి, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి, జిల్లా కలెక్టర్ పమేల సత్పతి అధికారులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్న అని అన్నారు. అట్టి స్కూల్‌ను మానకొండూర్ నియోజకవర్గం ప్రజలు విద్యార్థుల ను చేర్పించలని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి రావుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుచు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేయడం జరిగింది.

## పూలే విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సూర్య కొత్తపల్లి**




బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్. వరంగల్ జిల్లా దేశాయిపేట గ్రామంలో గల పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే పట్టుకొని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. సామాజిక ఉద్యమాలను నిర్వహించి బీసీల అభివృద్ధికి ఎంతోగాను తోడ్పాటున అందించిన మహనీయుడు జ్యోతి రావు పూలే అని వారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. తక్షణమే కారకులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీసీ రాజ్యాధికార సమితి నాయకులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను జిల్లాల వారిగా ఏర్పాటు చేయాలి

**- పి.ఆర్.టి.యూ. టీఎస్.మానకొండూర్ అధ్యక్షులు కేతిరి జీవన్ రెడ్డి**

**సూర్య-మానకొండూర్**

రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయటం వలన గ్రామీణ ప్రాంత పాఠశాలలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పి.ఆర్.టి.యూ. టీఎస్.మానకొండూర్ అధ్యక్షులు కేతిరి జీవన్ రెడ్డి పత్రిక ప్రకటనలో తెలిపారు. మానకొండూర్ మండలంలోని విద్యార్థుల సంఖ్య 2500లోపే ఉన్నదన్నారు. నియోజకవర్గాల వారీగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయడం వలన ప్రభుత్వ పాఠశాలలు నామమాత్రం అయ్యే ప్రమాదం ఉన్నదన్నారు.ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నియోజకవర్గాల వారీగా కాకుండా జిల్లాల వారీగా ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత వాసులకు, గ్రామీణ ప్రాంత పాఠశాలలకు శ్రేయస్కరంగా ఉంటుందని పేర్కొన్నారు. కావున ప్రభుత్వము ఒకసారి పునరాలోచన చేయాలని ఆయన పత్రికాముఖంగా ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు.